సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



యూరియా తరలింపుపై కొరడా

యూరియా అక్రమ తరలింపుపై సహకార శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. డీసీసీబీ డైరెక్టర్‌పై అనర్హత వేటు వేశారు. 8లో



ప్రవక్త మార్గం అనుసరణీయం

ప్రవక్త మార్గం అనుసరణీయమని ముస్లిం మత పెద్దలు పేర్కొంటున్నారు. నేడు మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించనున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 32° / 23°

జిల్లాలో సోమవారం ఉదయం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతంగా మారుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థాన అంతరాలయంలోని రామయ్య మూలమూర్తులకు ఆదివారం అభిషేకం జరిపారు. అనంతరం సువర్ణ పుష్పార్చన గావించారు. కాగా తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి చిత్రకూట మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

రామయ్య సన్నిధిలో ఏఎస్పీ దంపతులు



ఆలయంలో ఏఎస్పీ దంపతులు, దేవస్థాన అధికారులు

శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఆదివారం భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు పూజలు చేశారు. పండితులు శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో వేదాశీర్వచనం చేసి ప్రసాదాలను అందచేశారు. ఆలయ ఈఈ రవీందర్, పర్యవేక్షకుడు లింగాల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి విశేష పూజలు



విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి జిల్లా నలుమూలలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం, తలనీలాలు, చీరలు, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరపగా, భక్తులు బోనాలు, సారెలను సమర్పించారు. అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్ శర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా సెలవు రోజు కావడంతో రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు అందజేయడానికి కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

25న జాతీయ యువజన ఉత్సవాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ నెల 25న కొత్తగూడెం క్లబ్‌లో 28వ జాతీయ యువజన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో యువ కళాకారులకు, సైన్స్ విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 15 నుంచి 29 ఏళ్ల వయసు కలిగినవారు పోటీలకు అర్హులని, ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన వారిని జాతీయస్థాయి ఉత్సవాలకు ఎంపిక చేస్తామని తెలిపారు. జానపద నృత్యం, జానపద గేయాలు, కవిత్వం, వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, వక్తృత్వ పోటీలు, సైన్స్ మేళా పోటీలు నిర్వహిస్తామని, పోటీల్లో విద్యార్థులు, విద్యార్హత లేని యువకులు పాల్గొనవచ్చని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులు, హస్తకళలు, వస్త్రాలు తదితర రంగాలకు సంబంధించిన వారు కూడా పోటీల్లో పాల్గొనవచ్చని, ఈ విభాగాల్లో ఇద్దరిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు 9247296012 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ వివరాలను ఈ నెల 23వ తేదీ లోగా జిల్లా యువజన క్రీడల అధికారి కార్యాలయంలో నమోదు చేసుకోవాలని, dyso Bhadradri@gmail.comకు మెయిల్ కూడా చేయవచ్చని వివరించారు.

కనకగిరిపై కలెక్టర్..

16 కిలోమీటర్లు నడిచిన జితేష్ వి.పాటిల్

ఇటీవల వర్షాలకు తేలిన రాళ్లు, రప్పలు దాటుకుంటూ కొండపైకి..

ఇక్కడి ప్రకృతి అందాలను దేశం చూడాలి

- భవిష్యత్‌లో అద్భుతమైన టూరిజం హబ్‌గా మారుతుంది
- కొండలపై కాటేజీల ఏర్పాటుకు ఆదివాసీలు ముందుకురావాలి
- కనకగిరి గుట్టల సందర్శనలో కలెక్టర్ జితేష్ వి. పాటిల్





కనకగిరి గుట్టలపై ఆదివాసీ యువకులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్ (ఇన్‌సెట్) గుట్టపై ఉన్న వీరభద్రుడి ఆలయం వద్ద కలెక్టర్

చండ్రుగొండ: సహజ సిద్ధంగా ఉన్న కనకగిరి గుట్టల ప్రకృతి అందాలు రాష్ట్రమే కాదు దేశం చూడదగినవని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఇతర దేశాల్లోని అందాలకంటే ఇవి అద్భుతమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతం టూరిజం హబ్‌గా మారుతుందని చెప్పారు. ఇక్కడి ఔషధ మొక్కలను వినియోగించుకోవాలని అన్నారు. చండ్రుగొండ మండలం మారుమూల గిరిజన గ్రామమైన బెండాలపాడు శివారులో ఉన్న కనకగిరి గుట్టలను ఆదివారం కలెక్టర్ సందర్శించారు. ఆదివాసీలతో కలిసి కొండలు ఎక్కారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాకతీయుల చరిత్ర కలిగిన ఈ గుట్టలను పర్యాటక కేంద్రంగా మార్చాలని, ఇక్కడికి వస్తే మానసిక ఒత్తిడి నుంచి పూర్తిగా ఉపశమనం పొందుతారని చెప్పారు. ఆహ్లాదంగా గడిపేలా వెదురు కలపతో ఆవాసాల (కాటేజీలు) ఏర్పాటును ప్రోత్సహిస్తామని, ఇందుకు ఆదివాసీ గిరిజన యువకులు ముందుకురావాలని పేర్కొన్నారు. అందుకయ్యే ఖర్చు ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తానని అన్నారు.

బ్యాంబో క్లస్టర్ పరిశీలన

బెండాలపాడు శివారులో జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ, నాబార్డ్ సంయుక్త సహకారంతో పల్లేరు వీరభద్రం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యాంబో క్లస్టర్‌ను కలెక్టర్ సందర్శించారు. వెదురు ఉత్పత్తులను పరిశీలించి, తయారీలో క్లస్టర్ సభ్యుల నైపుణ్యాన్ని అభినందించారు. మార్కెటింగ్‌కు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామని, సభ్యులను ఉత్పత్తుల నమూనాలతో త్వరలోనే హైదరాబాద్ తీసుకెళ్తానని వివరించారు.

'సాక్షి' కథనం నన్ను కదిలించింది..

కనకగిరి గుట్టలపై సాక్షిలో ప్రచురితమైన కథనం తనను కదలించిందని కలెక్టర్ పేర్కొన్నారు. అది చదివినప్పుడే ఈ ప్రాంతం చూడాలనుకున్నానని, బిజీ కారణంగా సమయం చూసుకుని ఇప్పుడు వచ్చానని తెలిపారు. ఈ సందర్భంగా సాక్షిని ప్రత్యేకంగా అభినందించారు. కాగా గత నెల 18న సాక్షిలో ఇక్కడి ప్రకృతి అందాలపై కనకగిరికి పూర్వ వైభవం శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. కలెక్టర్ వెంట నడిచిన వారిలో సీనియర్ నాయకుడు భోజ్యానాయక్, ఫజల్‌బక్ష్‌తోపాటు క్లస్టర్ సభ్యులు ఈసం నాగభూషణం, బొర్రా సురేష్, మల్లం కృష్ణయ్య, కారం అన్వేష్, వర్సా శ్రీను, చీదర ప్రసాద్, కుంజా కృష్ణయ్య ఉన్నారు.

ఆదివాసీలతో కలిసి గుట్ట ఎక్కి..



ఆదివాసీలతో కలిసి గుట్ట ఎక్కి దిగుతున్న కలెక్టర్


ఉదయం 6 గంటలకు జిల్లా కేంద్రం కొత్తగూడెం నుంచి కారులో బయలుదేరిన కలెక్టర్ జితేష్ 7 గంటలకు బెండాలపాడు శివారు కనకగిరి అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. హంగూఆర్భాటం లేకుండా ఆదివాసీ యువకులతో కలిసి కనకగిరి గుట్టల పైభాగానికి కాలినడకన చేరుకున్నారు. పోలీస్, రెవెన్యూ శాఖలతోపాటు ఇతర అధికారులకు ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదు. తొలుత గుట్టల కింద భాగంలోని హస్తాల వీరన్నస్వామి దర్శనం చేసుకున్నారు. గుట్టలు ఎక్కాక వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఏనుగుల మోటబావి, పసుపుబావి, బొర్రాయి, పల్లేరుబావి, ఫారెస్టు వాచ్‌టవర్, జలపాతాలు, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన చెక్‌డ్యాంలను పరిశీలించారు. చండ్రుగొండ, పెనుబల్లి, కల్లూరు, ఏన్కూరు, జూలూరుపాడు మండలాల్లో విస్తరించి ఉన్న కనకగిరి గుట్టల అందాలను కలెక్టర్ ఆస్వాదించారు. ఇలా ఆదివారం కలెక్టర్ పర్యటన 16 కిలోమీటర్లు కాలినడకన సాగింది. గుట్టలు దిగాక కలెక్టర్‌ను ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఎస్‌ఐ గంజి స్వప్న కలిశారు.

స్కానింగ్, ఎక్స్‌రే బంద్



జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్

- వెంటిలేటర్లు పనిచేయక రోగుల అవస్థలు
- వెంటాడుతున్న వైద్యులు, టెక్నీషియన్ల కొరత
- జిల్లా సర్వజన, ఎంసీహెచ్ ఆస్పత్రుల్లో వైద్యం అంతంతే..



ఎక్స్‌రే రూమ్

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రి, రామవరంలోని ఎంసీహెచ్ ఆస్పత్రుల్లో సమస్యలు తిష్టవేశాయి. మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో 130 పడకలు ఉండగా, ప్రతి నెలా 200 నుంచి 300 వరకు ప్రసవాలు జరుగుతాయి. రోజూ 200 నుంచి 300 వరకు ఓపీ ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా గర్భిణులు వైద్యం కోసం ఇక్కడికి వస్తారు. ఆస్పత్రి నుంచి స్త్రీ వైద్య నిపుణులు, ఆర్థోపెడిక్ వైద్యులు, రేడియాలాజిస్టులు బదిలీకాగా, వారిస్థానంలో కొత్తవారిని నియమించలేదు. సిబ్బంది కొరతతో ఈ నెల 1 నుంచి గర్భిణులకు స్కానింగ్ తీయటం నిలిపివేశారు. సర్జరీలు కూడా చేయడం లేదు. వైద్యుల కొరత కారణంగా ప్రసవాల సంఖ్య కూడా తగ్గింది. గర్భిణులకు, తల్లీ బిడ్డలకు సరైన వైద్యం అందడంలేదని పలువురు పేర్కొంటున్నారు.

ఎంసీహెచ్‌లో నలుగురే వైద్యులు

ఎంసీహెచ్‌లో ఇద్దరు గైనకాలజిస్టులు, ఇద్దరు పిల్లల వైద్య నిపుణులు మాత్రమే ఉన్నారు. 24 గంటల గర్భిణులు, బాలింతలో ఉండే ఆస్పత్రిలో కేవలం నలుగురే వైద్యులు ఉండటంతో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే డెలివరీకి రూ. 25 వేల నుంచి రూ. 40 వేల ఫీజు తీసుకుంటున్నారు. ప్రభుత్వాస్పత్రికి వస్తే 15 రోజుల నుంచి స్కానింగ్ తీయడంలేదు. వైద్యం సక్రమంగా అందడంలేదు.

టెక్నీషియన్లు లేక..

జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో మూడు ఎక్స్‌రే మిషన్‌లు ఉన్నాయి. ఇందులో ఒకటి పని చేయటంలేదు. టెక్నీషియన్ లేకపోవడంతో కొన్ని రోజులుగా ఎక్స్‌రే తీయటం నిలిపివేశారు. కాళ్లు, చేతులు విరిగిన వారు వైద్యం కోసం వస్తే వైద్యులు ప్రైవేటుగా ఎక్స్‌రే తీసుకుని రావాలని చెబుతున్నారు. ఆస్పత్రిలో 280 పడకలు ఉండగా, రోజూ 500 నుంచి 700 వరకు ఓపీ ఉంటుంది. రోజుకు సుమారు 40 మంది వరకు ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్‌గా చేరతారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు సురేందర్, నవీన్, పుష్పలత తదితరులు బదిలీపై వెళ్లారు. వైద్యుల కొరత ఏర్పడి వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి కృత్రిమశ్వాస అందించే వెంటిలేటర్లు పని చేయటంలేదు. ఆస్పత్రి నుంచి వచ్చే డ్రెయినేజీ నీరు ఆస్పత్రి ముందు నిల్వడంతో రోగులు, వైద్యులు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. కాగా ఇటీవల కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆస్పత్రిని సందర్శించినపుడు వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రాజకుమార్, ఆర్‌ఎం రాధామోహన్ సమస్యలను వివరించారు. మందుల కొరత ఉందని చెప్పగా, రూ. 12 లక్షలు కేటాయించారు. అలాగే మిగతా సమస్యలను కూడా పరిష్కరించాలని కలెక్టర్‌ను జిల్లా ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



ఎంసీహెచ్‌లో సిబ్బంది కొరతతో స్కానింగ్ తీయటం లేదు. సర్వజన ఆస్పత్రిలో టెక్నీషియన్ లేక ఎక్స్‌రే ఆగిపోయింది. బదిలీపై వెళ్లినవారి స్థానంలో కొత్తవారి నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చారు. గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం. త్వరలో సమస్యలన్నీ పరిష్కారిస్తాం.

–రాధామోహన్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

పర్యావరణహితంగా జరుపుకోవాలి



వినాయకుడిని నిమజ్జనానికి వెళ్తున్న పీఓ రాహుల్, మనీష దంపతులు, ఏఎస్పీ అంకిత్ కుమార్

భద్రాచలంఅర్బన్: వేడుకలు, ఉత్సవాలు పర్యావరణహితంగా జరుపుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. వినాయక చవితి సందర్భంగా తన ఇంట్లో ఏర్పాటు చేసుకున్న మట్టి వినాయకుడిని ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి గణపతి ప్రతిమలను పూజిస్తే జల కాలుష్యాన్ని కూడా అరికట్టవచ్చని అన్నారు. వినాయక చవితి సందర్భంగా మట్టి ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేసిన స్వచ్ఛంద సంస్థలను ఆయన అభినందించారు. గోదావరిలో గణపతి నిమజ్జనం చేసే సమయంలో భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల సిబ్బంది సూచనలు పాటించాలని చెప్పారు. సెల్ఫీలు దిగడం, బాణాసంచా కాల్చడం, మద్యం తాగడం, డీజే సౌండ్ సిస్టం వినియోగించడం లాంటివి చేయొద్దని, ప్రశాంతంగా నిమజ్జనం చేసి, సురక్షితంగా ఇళ్లకు చేరాలని అన్నారు. భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్, ఇరిగేషన్ శాఖ జేఈ వెంకటేష్, సేవ్ భద్రాద్రి వ్యవస్థాపకుడు పాకాల దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉమ్మడి జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు ఖమ్మం చేరుకుంటారు. 3.30 గంటలకు గాంధీచౌక్‌లో గణేష్ శోభాయాత్రలో పాల్గొంటారు. మంగళవారం ఉదయం 10 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేస్తారు. 3 గంటలకు ఖమ్మం నియోజకవర్గంలోని ఆల్లీపురంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

గరిష్టస్థాయికి కిన్నెరసాని నీటిమట్టం

406.10 అడుగులుగా నమోదు



కిన్నెరసాని జలాశయం

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షానికి వరద నీరు వచ్చి చేరడంతో కిన్నెరసాని జలాశయం నీటిమట్టం గరిష్టస్థాయికి చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 407 అడుగులు కాగా, ఆదివారం 406.10 అడుగులుగా నమోదైంది. ఎగువ నుంచి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, వరద ఉధృతి ఇంకా పెరిగితే ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తామని పర్యవేక్షక ఇంజనీరు తెలిపారు. కాగా 406 అడుగులకు మించి నీటిని నిల్వ చేయడంతో ప్రాజెక్ట్ దిగువ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగువన ఒక్కసారిగా భారీ వర్షం వస్తే పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని, అప్పుడు అన్ని గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తే తమ గ్రామాలకు నష్టం జరుగుతుందని పేర్కొంటున్నారు.

దేశం గర్వించే ఇంజనీర్ విశ్వేశ్వరయ్య

సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు



వేడుకల్లో పాల్గొన్న డైరెక్టర్ సత్యనారాయణరావు, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): దేశం గర్వించే ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని సింగరేణి డైరెక్టర్ (ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు పేర్కొన్నారు. ఆదివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు. విశ్వేశ్వరయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ భారతదేశం ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన జయంతి రోజున ఇంజనీర్స్ డే జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుత ఇంజనీర్లు ఆయన్ను ఆదర్శంగా తీసుకుని నూతన టెక్నాలజీలను వినియోగిస్తూ విలువలతో కూడిన ఇంజనీరింగ్ పనితనం చూపాలని, నాణ్యమైన ప్రాజెక్టులను నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సాయిబాబు, సూర్యనారాయణ రాజు, వీసం కృష్ణయ్య, సామ్యేల్ సుధాకర్, కే. శ్రీనివాసరావు, సోమయాజుల రామమూర్తి, రామకృష్ణ, గుర్తింపు సంఘం నాయకులు రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం నాయకులు పీతాంబరం పాల్గొన్నారు.

నేటి నుంచి వ్యవసాయ, అనుబంధ శాఖల ప్రదర్శన

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల స్టాళ్లను సోమ, మంగళవారాల్లో ఏర్పాటు చేయనున్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా రైతాంగాన్ని చైతన్యం చేసే విధంగా ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, టెక్స్‌టైల్స్, హ్యాండ్లూమ్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నారు. వ్యవసాయ సాంకేతిక ప్రదర్శనలో రైతులకు అవసరమైన ఆధునిక వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, వివిధ పంటల మేలైన విత్తనాలు, సరికొత్త వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన ప్రదర్శన, సుస్థిర వ్యవసాయం, ఉద్యాన పంటల ప్రదర్శన, మత్స్య, పాడి పశువుల ప్రదర్శనలను ఏర్పాటు చేయనున్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం తెలిపారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ప్రకాశం స్టేడియంలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రదర్శనల ఏర్పాట్లను కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదివారం రాత్రి పరిశీలించారు. స్టాళ్లలో రైతులకు కావాల్సి విత్తనాలు, ఎరువులు, కంపెనీల వివరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. వ్యవసాయపై ఆసక్తి యువత స్టాళ్లను సందర్శించి నూతన వ్యవసాయ విధానంపై అవగాహన పెంచుకోవాలని అన్నారు.

'పజాపాలన'కు ముఖ్యఅతిథిగా తుమ్మల

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 17న ఉదయం 10 గంటలకు ప్రకాశం స్టేడియంలో నిర్వహించే వేడుకలకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

'విశ్వకర్మ' ఎంపికలో జాప్యం..

- పది నెలల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- క్షేత్రస్థాయిలో నత్తనడకన విచారణ ప్రక్రియ
- జిల్లావ్యాప్తంగా 14,827 మంది అర్జీలు
- ఆశగా ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు



శిక్షణ పూర్తి చేసిన లబ్ధిదారులు

చుంచుపల్లి: విశ్వకర్మ పథకం దరఖాస్తుల విచారణ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. దీంతో దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. కుల, చేతివృత్తిదారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ గతేడాది సెప్టెంబర్ 17న ప్రారంభించారు. ఆ తర్వాత జిల్లాలో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పది నెలలు గడిచినా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తుల పరిశీలనకే నెలలు గడుస్తుంటే ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ, రుణాల మంజూరుకు ఎంతకాలం పడుతుందని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు.

పది నెలల నుంచి దరఖాస్తులు..

జిల్లాలో గత 10 నెలల నుంచి దరఖాస్తులను మీసేవా కేంద్రాలతో పాటు, ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేసి స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు 14,827 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని గ్రామీణ ప్రాంతాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి అర్హులను గుర్తించాలి. అయితే ఇప్పటివరకు సగం దరఖాస్తులపై కూడా విచారణ పూర్తికాలేదు. మొదటిదశలో 6,495 దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తి కాగా, మరో 8,333 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక రెండో దశలో(డిస్ట్రిక్ట్ లెవల్) 4,527 దరఖాస్తులు వెరిఫికేషన్ పూర్తి కాగా, 1,873 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 213 మంది లబ్ధిదారులు ట్రైనింగ్ సెంటర్లలో శిక్షణ పూర్తిచేసుకోగా, వారికి త్వరలో రూ.15 వేల విలువైన టూల్‌కిట్లను అందజేయనున్నారు. గతేడాది నవంబర్‌లో అసెంబ్లీ, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడం, ఇటీవల పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది బదిలీలు వంటి కారణాలతో విచారణ ప్రక్రియ జాప్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక లాగిన్ కేటాయించగా, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారు దరఖాస్తులను తిరిగి పరిశీలించాలంటే మళ్లీ లాగిన్ క్రియేట్ చేయాల్సి ఉంటుంది. దీంతో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మరికొంత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

18 రకాల వ్యాపారులకు రుణాలు..

పీఎం విశ్వకర్మ యోజన పథకంలో 18 రకాల వ్యాపారాలకు రుణ సదుపాయం పొందే వీలు కల్పించారు. ప్రధానంగా కమ్మరి, వడ్రంగి, స్వర్ణకార, శిల్పి, కుండలు, దుస్తులు, చీపుర్ల తయారు, బార్బర్, చెప్పులు కుట్టేవారు, బొమ్మల తయారీ, చేపల వల, దండలు చేసేవారు, తాపీ పని లాంటి వృత్తులు చేసే వారిని ప్రోత్సహిస్తారు. లబ్ధిదారులను ఎంపిక చేసి వృత్తి నైపుణ్య శిక్షణనిస్తారు. అధునాతన వృత్తి పరికరాల కొనుగోలు కోసం రూ.15 వేల ఆర్థిక సాయంతో పాటు మరో రూ. లక్ష వరకు రుణం మంజూరు చేస్తారు.



పీఎం విశ్వకర్మ పథకం లోగో

త్వరగా పూర్తయ్యేలా చూస్తాం

దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొంత ఆలస్యమైన మాట వాస్తవమే. ఇటీవల జిల్లాలో కార్యదర్శులు ఒకచోట నుంచి ఇంకో చోటకు బదిలీ కావడంతో అంతటా లాగిన్ సమస్య తలెత్తింది. జిల్లాలో ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసి సాధ్యమైనంత మేరకు దరఖాస్తుల విచారణ త్వరగా పూర్తయ్యేలా చూస్తాం.

– తిరుపతయ్య, పరిశ్రమల శాఖ డీఎం

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలు మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ కూడలిలో ఆదివారం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో యాచకురాలు బానోత్ తులసి (80) మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ వేపలగడ్డతండాకు చెందిన తులసి కొన్నేళ్ల కిందట ఇల్లెందు కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగించేది. వృద్ధాప్యం కారణంగా కూరగాయలు విక్రయించలేక యాచకురాలిగా మారింది. ఆదివారం రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన ఇల్లెందు నుంచి ఖమ్మం వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. వృద్ధురాలి ఎత్తుతో డివైడర్ ఉండటం, మూలమలుపు ఇరుకుగా ఉండటంతో వృద్ధురాలిని గమనించలేకపోయిన డ్రైవర్ ఢీకొట్టినట్లుగా స్థానికులు చెబుతున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


ఏసురాజు (ఫైల్)

దమ్మపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందతున్న ఓ వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నల్లకుంట గ్రామానికి చెందిన ఊకే ఏసురాజు (31) తాపీ పనిచేస్తూ సత్తుపల్లి పట్టణంలో నివసిస్తున్నాడు. శనివారం సాయంత్రం తన బైక్‌పై సత్తుపల్లి నుంచి మండలంలోని ముష్టిబండ గ్రామానికి కూలి పని డబ్బుల కోసం వచ్చి తిరిగి బయలుదేరాడు. మొద్దులగూడెం క్రాస్‌రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. స్థానికులు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

ఆమె కారణంగానే ఆత్మహత్య..!


సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న వ్యక్తి

భద్రాచలంఅర్బన్: మహిళ తనపై కేసులు పెట్టించి, మానసికంగా వేధింపులకు పాల్పడుతోందని, అందుకే తాను బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని ఓ వ్యక్తి తీసిన సెల్ఫీ వీడియో ఆదివారం భద్రాచలంలో సంచలనం సృష్టించింది. ఈ వీడియోలో సదరు వ్యక్తి మాట్లాడుతూ.. పుష్ప అనే మహిళ తనను వేధింపులకు గురిచేస్తోందని, తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని, ఈ విషయం తన భార్య నవీనకు తెలపాలని, తన కుటుంబానికి అందరూ అండగా ఉండాలని తీసిన వీడియో వైరల్‌గా మారింది. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

కేటీపీఎస్ ఉద్యోగి ఆత్మహత్య


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

పాల్వంచ: భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపంతో కేటీపీఎస్ ఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. కేటీపీఎస్‌లో విధులు నిర్వహించే మల్లూరి శ్రీకాంత్ (29).. ఏ-కాలనీ, క్వార్టర్ నంబర్ జీ-37లో నివాసం ఉంటున్నాడు. కాగా, శ్రీకాంత్ మద్యానికి బానిసై భార్య నవీనతో తరచూ గొడవ పడుతున్నాడు. దీంతో ఆమె రెండు రోజుల కిందట పుట్టింటికి వెళ్లింది. ఆదివారం భార్యకు ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరగా, కొట్టడం వల్ల దెబ్బలు తగిలాయని, అవి తగ్గాక వస్తానని తెలిపింది. క్షణికావేశానికి లోనైన శ్రీకాంత్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని మామిళ్లవారిగూడెం సమీపంలోని వాగు నుంచి అశ్వారావుపేటకు ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ వనమా నాగరాజుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

వరుస చోరీలతో ఆందోళన

తిరుమలాయపాలెం: రైతులకు చెందిన విద్యుత్ మోటార్ల కాపర్ వైర్లను దుండగులు చోరీ చేస్తున్నారు. మండలంలోని ఎదుళ్లచెరువులో గతంలో రెండు సార్లు పలువురు రైతులకు చెందిన మోటార్లలోని కాపర్ వైర్లు చోరీ జరగగా శనివారం రాత్రి గ్రామానికి చెందిన ఐదుగురు రైతులకు చెందిన ఆరు విద్యుత్ మోటార్ల వైర్లను ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజంతా పనులు చేసుకుంటున్న తాము రాత్రి సమయంలో వస్తున్న దొంగలను ఎలా పట్టుకోవాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని ఎస్‌ఐ కూచిపూడి జగదీశ్ దృష్టికి తీసుకెళ్లారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,392

ప్రవక్త మార్గం అనుసరణీయం

- నేడు మిలాద్ ఉన్ నబీ
- ముస్తాబైన మసీద్‌లు
- ప్రవక్త సందేశాలను వివరించనున్న మత పెద్దలు


కరకగుడెంలో జామా మస్జిద్‌లో సందేశం ఇస్తున్న మౌలానా ఫిరోజ్

కరకగూడెం: ఇస్లాం సంప్రదాయం ప్రకారం మహమ్మద్ ప్రవక్త (స.అ.) జన్మదినం సందర్భంగా ముస్లింలు సోమవారం మిలాద్ ఉన్ నబీ పండుగను జరుపుకోనున్నారు. ఇస్లామియా కేలండర్‌లోని రబీ ఉల్ అవ్వల్ నెల ఆధారంగా పాటిస్తారు. ప్రత్యేక ప్రార్థనల కోసం మసీదులను శుభ్రం చేశారు. నిత్య నమాజులు ఐదు పూటలా కొనసాగుతాయి. వీటితో పాటు చివరి ప్రవక్తగా అవతరించిన మహమ్మద్ ప్రవక్త గురించిన సందేశాలను మత పెద్దలు ఇస్తారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచే ఇషా నమాజ్ తర్వాత ప్రత్యేకంగా బోధనలు చేస్తున్నారు. నాడు ఆయన జననం, అల్లాహ్ ఆరాధనలో గడిపిన తీరు, ఆధ్యాత్మిక వ్యాప్తికి పరితపించిన వైనం, పడిన కష్టాలను తెలుపుతారు. మక్కా, మదీనల గొప్పతనాన్ని కీర్తిస్తారు. ఖసీదా బుర్దా పేరిట ప్రవక్త శ్లాఘనలను పఠిస్తారు. శాంతి పాటించాలని, తోటి వారికి సాయం చేయాలని, ఉన్నంతలో పేదలకు అండగా నిలవాలని బోధించనున్నారు. మహమ్మద్ ప్రవక్త చూపిన బాట అనుసరణీయమని, అంతా ఆచరించాలని విశ్వసిస్తారు. అల్లాహ్ మార్గంలో పేదలకు సాయం చేయడం, ధనం ఖర్చు చేయడం అనే సంప్రదాయం మరింత గుర్తు చేసి.. ఆచరించేలా ప్రోత్సహిస్తారు. స్వచ్ఛమైన మనస్సుతో ప్రశాంతంగా ఉండాలని ఉద్బోధిస్తారు.

యావత్ సమాజంపై ప్రభావం..

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఘనంగా జరుపుకునే రోజు మిలాద్ ఉన్ నబీ(మహ్మద్ ప్రవక్త జన్మదినం). పదిహేను వందల ఏళ్ల కిందట అరేబియా ప్రాంతం తీవ్ర హింసకు, మూఢ నమ్మకాలకు, నల్లజాతి వారిపై దౌర్జన్యాలకు నిలయంగా ఉండేది. ఆ సమయంలో వాటిని నిరసిస్తూ ప్రవక్త మహమ్మద్ (స).. తన ప్రగతిశీల భావాలతో యావత్ సమాజాన్ని ప్రభావితం చేశాడని చెబుతారు. సమాజంలో పుట్టుక రీత్యా ఎవ్వరూ అధికులు, అల్పులు లేరని అందరం ఆ అల్లాహ్ ముందు సర్వ సమానమని, సమస్త మానవజాతి హితం కోసం వచ్చిన అంతిమ దైవం ప్రవక్త అని, మనిషి తలవంచాల్సింది కేవలం ఆ సృష్టికర్తకే గాని మరే ధనికులకు, ఇతరత్రా వ్యక్తులకు కాదని పిలుపునిచ్చారు. దీంతో ఆనాటి అరబ్బు ధనిక సర్దార్లకు తీవ్ర ఆగ్రహం కలిగి.. అప్పటి నుంచి ఆయనపై అనేక రకాలుగా దాడులు చేయించేవారు. అలాంటి వాటికి ఆయన వెరవక తన ప్రబోధాలతో ఆకర్షితులైన పేదలు, నల్లజాతి వారే కాకుండా అరేబియా ప్రాంతం మొత్తం అనుసరించడం ప్రారంభించింది. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రవక్త పేదలు, సమాజంలోని రుగ్మతలను పారదోలుతూ శాంతి, ప్రేమ, కరుణతో సమస్త అరేబియా సమాజాన్ని ప్రభావితం చేస్తూ ప్రాణాలను సైతం అర్పించారు.

ప్రవక్త సూచనలు ఆదర్శనీయం..



మహమ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో యావత్ ముస్లిం సమాజం నడుస్తుంది. ఆయన దివ్య బోధనలు సమాజాన్ని ప్రభావితం చేశాయి. పెద్దలు, అనాథలు, స్త్రీలు, వృద్ధులపై కరుణ చూపాలని, గౌరవం పాటించాలని ఆయన చెప్పిన సూచనలు ఆదర్శనీయం.

– మౌలానా ఖ్వారీ మొహమ్మద్ ఆజామ్, పద్మాపురం జామా మసీద్

గొప్ప సందేశాలు ఇచ్చారు..



నాడు ఇస్లాం బోధనల్లో మహమ్మద్ ప్రవక్త ఎన్నో గొప్ప సందేశాలు ఇచ్చారు. ఇతరులతో ఎలా మెలగాలి.. తోటివారికి ఎలా సాయం చేయాలి.. అనే విషయాలు సమగ్రంగా చెప్పారు. నేటికీ ఆ పద్ధతులు ఎంతో ఆదర్శం. యువత ఆచరించేలా పెద్దలు పదే పదే గుర్తు చేస్తుంటారు.

– మౌలానా మొహమ్మద్ ఫిరోజ్, కరకగూడెం జామా మసీద్

టైర్ పంక్చర్.. గంజాయి గుట్టు రట్టు..

అంబులెన్స్‌లో గంజాయి తరలిస్తుండగా గుర్తించిన యువకులు


గంజాయితో పట్టుబడిన అంబులెన్స్

కొత్తగూడెంటౌన్: అంబులెన్స్‌లో గుట్టుగా తరలిస్తున్న గంజాయి.. టైరు పంక్చర్ కావడంతో పట్టుబడింది. ఏఓబీ నుంచి తమిళనాడుకు అక్రమంగా గంజాయి తరలిస్తుండగా అనుకోకుండా టైరు పంక్చర్ కావడం.. స్థానిక యువకులు గంజాయిని చూసి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పట్టుకున్నారు. ఈ ఘటన కొత్తగూడెం పట్టణ పరిధిలోని రామవరం జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అంబులెన్స్‌లో గంజాయి ప్యాకెట్లు వేసుకుని, ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుని, సైరన్ వేసుకుని, పేషంట్‌కు సీరియస్‌గా ఉందని నమ్మిస్తూ తరలిస్తున్నారు. రామవరం జాతీయ రహదారిపైకి రాగానే టైరు పంక్చరైంది. సాయం చేద్దామని కొందరు యువకులు వచ్చి టైరుకు పంక్చర్ వేసి, అమర్చారు. అనంతరం లోపల పేషంట్‌ను చూపించాలని అడగటంతో డ్రైవర్ పొంతన లేని సమాధానాలు చెప్పాడు. అనుమానం వచ్చిన యువకులు డోరు తెరిచి చూడగా అందులో గంజాయి కనిపించింది. షాక్‌కు గురైన యువకులు స్థానిక నాయకులతో కలిసి డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌కు సమాచారం ఇచ్చారు. టూ టౌన్ సీఐ రమేశ్‌కుమార్, సిబ్బందితో వచ్చి డ్రైవర్‌తో పాటు గంజాయి ఉన్న అంబులెన్స్‌ను టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.2 కోట్లకు పైగా ఉంటుందని, గంజాయిని ఏఓబీ నుంచి తమిళనాడుకు తరిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై సీఐ రమేశ్‌కుమార్‌ను వివరణ కోరగా.. గంజాయి రవాణాపై విచారణ చేపట్టామని తెలిపారు.

మొండి బకాయిలపై ఈఓ ఫిర్యాదు

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ సముదాయంలోని ఒకటో నంబర్ దుకాణం రూ.19,37,600, నాలుగో నంబర్ దుకాణం రూ.11 లక్షలకు పైగా అద్దె చెల్లించాల్సి ఉండగా ఆలయ ఈఓ రజనీకుమారి రెండు రోజుల కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ మొత్తం 16 వ్యాపార దుకాణాలు ఉన్నాయి. బహిరంగా వేలంపాట ద్వారా దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు.. అద్దెలో మొదట 25 శాతం చొప్పున చెల్లిస్తారు. తర్వాత అద్దెకాలం చివరి నాటికి మిగిలిన 75 శాతం చెల్లించాల్సి ఉంటుంది. రెండు దుకాణాల నిర్వాహకులు అద్దె చెల్లించాలని పలుసార్లు నోటీసులు ఇచ్చినా స్పందన లేదని, దీంతో రెండు రోజుల కిందట పోలీసులకు ఫిర్యాదు చేశామని ఈఓ రజనీకుమారి తెలిపారు. తలనీలాలను వేలంపాటలో పాడుకున్న వ్యాపారి కూడా రూ.8 లక్షల బకాయి ఉందని, ఆ వ్యాపారి చెక్కు ఇవ్వగా అది బౌన్స్ కావాడంతో కోర్టులో కేసు వేశామని ఈఓ వివరించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

అశ్వారావుపేటరూరల్: మామిడిపుల్ల లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఓ లారీ ఢీకొట్టిన ఘటన ఆదివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన శ్రీరామ్మూర్తి, తగరం రాములు, అన్వర్, వెంకటేశ్ కలిసి ములకలపల్లిలోని ఓ తోటలో మామిడి చెట్లను నరికి, పుల్లను ట్రాక్టర్‌లో లోడు చేసి, అశ్వారావుపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో నారంవారిగూడెం కాలనీ సమీపంలోని రామచంద్రాపురం గుట్ట మలుపు దగ్గర హైదారాబాద్ నుంచి కాకినాడ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న నలుగురికి గాయాలు కాగా, గమనించిన స్థానికులు అశ్వారావుపేట సీహెచ్‌సీకి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శివరామకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించి, కేసు నమోదు చేశారు.

యూరియా అక్రమ తరలింపుపై కొరడా

డీసీసీబీ డైరెక్టర్, హరిజన సొసైటీ చైర్మన్‌పై వేటు

ఇల్లెందురూరల్: యూరియా అక్రమ తరలింపుపై సహకార శాఖ ఉన్నతాధికారులు కొరడా ఝులిపించారు. ఇప్పటికే సొసైటీ సీఈఓ హరిప్రసాద్‌ను సస్పెండ్ చేసిన సహకార శాఖ తాజాగా డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావుపై అనర్హత వేటు వేశారు. హరిజన సొసైటీ చైర్మన్ పదవితోపాటు డీసీసీబీ డైరెక్టర్ పదవికి అనర్హుడిగా ప్రకటించారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని పీఏసీఎస్ స్టాక్ పాయింట్ నుంచి 70 యూరియా బస్తాలు ఆగస్టు 22న రాత్రి మాణిక్యారంలోని డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు గోదాము చేరాయి. విషయం తెలుసుకున్న కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్ అదే రాత్రి విచారణ నిర్వహించి వ్యవసాయశాఖ అధికారుల సూచన మేరకు యూరియా బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. 23న జిల్లా సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, అధికారులు మేకుమారి, కనకదుర్గ, ఇల్లెందు ఏడీఏ లాల్‌చంద్ యూరియా అక్రమ తరలింపు ఘటనపై విచారణ నిర్వహించారు. అదేరోజు సాయంత్రం డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, పీఏసీఎస్ సీఈఓ హరిప్రసాద్, యూరియా తరలించిన వాహన డ్రైవర్ ఉపేందర్‌పై కేసు నమోదు చేయాలని కొమరారం పోలీసులకు సిఫార్సు చేశారు. ఈ క్రమంలో ఆగస్టు 24న పీఏసీఎస్ సీఈఓ హరిప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార శాఖ అధికారి ఖుర్షీద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇల్లెందు వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు లాల్‌చంద్ పీఏసీఎస్ సీఈఓ, డీసీసీబీ డైరెక్టర్, వాహన డ్రైవర్‌పై నిత్యావసరాల చట్టానికి లోబడి 6–ఏ కేసు నమోదు చేశారు. తాజాగా యూరియా అక్రమ తరలింపునకు ప్రధాన బాధ్యుడిగా విచారణలో అధికారులు గుర్తించిన జనగం కోటేశ్వరరావును డీసీసీబీ డైరెక్టర్, హరిజన సొసైటీ పదవులకు అనర్హుడిగా ప్రకటిస్తూ జిల్లా సహకార శాఖ అధికారి ఖుర్షీద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, యూరియా అక్రమ తరలింపు వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని, ఈ వ్యవహారాంపై కోర్టును ఆశ్రయిస్తానని జనగం కోటేశ్వరరావు వెల్లడించారు.

నాటుసారా పట్టివేత

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం మీదుగా ఏపీ నుంచి బూర్గంపాడు మండలంలోని సారపాకకు అక్రమంగా తరలిస్తున్న నాటుసారాను ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. పట్టణంలోని కూనవరం రోడ్డులో ఓ ఆటోలో తరలిస్తున్న నాటుసారాను గుర్తించి, స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ద్విచక్రవాహనం, రెండు మొబైళ్లను స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. తనిఖీల్లో తిరుపతి, రమేశ్, కరీమ్, బాలు, భిక్షం, అలీమ్, హరీశ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం

జూలూరుపాడు: వెంగన్నపాలెం కోళ్ల ఫారంలో అక్రమంగా నిల్వ చేసిన 22 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పౌరసరఫరాలశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం సివిల్ సప్లయి ఆర్‌ఐ నెక్కిలి వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. వెంగన్నపాలెం గ్రామంలోని ఓ కోళ్లఫారానికి అన్నారుపాడు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు ఆటోలో 2 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామని, అదే గ్రామానికి చెందిన గుగులోత్ వినోద్‌కుమార్ బైక్‌పై 1.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామని, కొమ్ముగూడెంలోని ఓ ఇంట్లో అన్నారుపాడుకు చెందిన బానోత్ ప్రసాద్ 1.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ చేయగా పట్టుకున్నామని, కోళ్ల ఫారం నిర్వాహకుడు కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన దొడ్డి కిరణ్‌కుమార్ గదిలో నిల్వ ఉంచిన 17 క్వింటాళ్ల బియ్యం కూడా స్వాధీనం చేసుకున్నామని ఆర్‌ఐ వెల్లడించారు. నలుగురిపై కేసు నమోదు చేశామని, ఆటో, బైక్‌లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని ఆయన వివరించారు.

చర్లలో ముమ్మరంగా పోలీసుల తనిఖీ

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు పెద్దఎత్తున తనిఖీలు నిర్వహించారు. చర్లలో ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాలకు చెందిన ఆదివాసీలు పెద్దఎత్తున తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. ఆదివాసీలను ఆపి నిశితంగా పరిశీలించారు. సీఐ రాజువర్మ, ఎస్‌ఐ నర్సిరెడ్డి నేతృత్వంలో తనిఖీలు కొనసాగాయి.

గంగమ్మ గుడిలో వ్యక్తి ఆత్మహత్య


తప్పెట వంశీ (ఫైల్)

చింతకాని: మండలంలోని వందనం గ్రామం చివరన ఉన్న గంగమ్మ గుడిలో కొణిజర్ల మండలం అనంతారం గ్రామానికి చెందిన తప్పెట వంశీ (26) ఉరేసుకుని ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. అనంతారం గ్రామానికి చెందిన వంశీ ఖమ్మంలో నెట్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. నగరానికే చెందిన ఓ యువతిని గతేడాది ప్రేమ వివాహం చేసుకున్నాడు. పది రోజుల కిందట భార్యను ఆమె తల్లిదండ్రులు తీసుకెళ్లటంతో మనస్తాపం చెందిన వంశీ శనివారం ఖమ్మం వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. వందనంలోని గంగమ్మ గుడి వద్దకు వచ్చి రేకుల షెడ్ కోసం వేసిన ఇనుప రాడ్డుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న వంశీ తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతుని తండ్రి జకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

మహిళను రక్షించిన పోలీసులు

కారేపల్లి: డయల్ 100కు ఫోన్ రావడంతో అప్రమత్తమైన పోలీసులు ఓ మహిళను ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించిన ఘటన మండలంలోని ఓ తండాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని ఓ తండాలో దంపతుల మధ్య గొడవ జరుగుతుండటంతో డయల్ 100కు ఫోన్ చేశారు. స్పందించిన కారేపల్లి కానిస్టేబుల్ సీతారాములు, డ్రైవర్ సైదులతో వాహనంలో తక్షణమే తండాకు చేరుకున్నారు. అప్పటికే దంపతుల మధ్య గొడవ తారాస్థాయికి చేరుకోవటంతో, భార్య తీవ్ర మనస్తాపంతో ఇంట్లోనే తలుపులు వేసుకొని ఉరివేసుకుంది. అక్కడికి చేరుకున్న పోలీసులు తలుపులు పగులకొట్టి లోనికి వెళ్లి ఆమెను కిందికి దింపారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను పోలీసులు స్థానిక మహిళల సహకారంతో సీపీఆర్ చేసి, ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆ మహిళ ప్రాణాలతో బయటపడింది. కానిస్టేబుల్ సీతారాములు, డ్రైవర్ సైదులును కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

- పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయండి
- లోగో ఆవిష్కరణలో సంఘం మాజీ నాయకులు


లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలను బలోపేతం చేయడం ద్వారానే విద్యారంగ సమస్యలు పరిష్కారం అవుతాయని పీడీఎస్‌యూ పూర్వ నాయకులు వడ్డెల్లి కృష్ణమూర్తి, రాయల రవి, ఆవుల అశోక్ అన్నారు. ఆదివారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయంలో పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభ లోగోను సంఘం ప్రస్తుత, పూర్వ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోట్లాది మందిలో చలనాన్ని తీసుకొచ్చి పోరుబాటలో నడిచిన సంస్థ పీడీఎస్‌యూ అన్నారు. ఉస్మానియా గడ్డ మీద జార్జ్ రక్తంతో తడిసిన బిగి పిడికిలి పతాకం జేసీఎస్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, చేరాలు, కోలా శంకర్, చాంద్ పాషా, స్నేహలత, రంగవల్లి, రమణయ్య, సాంబయ్య తదితరుల త్యాగమయ చరిత్రతో విద్యార్థి ఉద్యమాన్ని ఉధృతం చేసిన పీడీఎస్‌యూ కోట్లాది విద్యార్థులకు మార్గదర్శి అయ్యిందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని ఉద్యమాలు కొనసాగిస్తున్న విద్యార్థి సంఘంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ నెల 22న ఖమ్మం నగరంలో జరగనున్న పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభకు విద్యార్థులు, పూర్వ, ప్రస్తుత పీడీఎస్‌యూ నాయకులు, మేధావులు పాల్గొంటున్నారని, సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పూర్వ నాయకులు మనోహర్‌రాజు, ఆళ్ల రామారావు, కృష్ణారావు, విజయ్, సీవై పుల్లయ్య, జి.రామయ్య, అర్జున్‌రావు, శిరోమణి, ఝాన్సీ, ఆవుల వెంకటేశ్వర్లు, శరత్, డి.శ్రీను, కె.శ్రీను, మమత, సంధ్య, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వి.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రజాకార్లను తరిమింది కమ్యూనిస్టులే..


బ్రాహ్మణపల్లిలో అమరులకు నివాళులర్పిస్తున్న హేమందరావు, ప్రసాద్

మధిర/బోనకల్/వైరారూరల్: ప్రజలను హింసిస్తూ, అరాచకాలను సృష్టించిన రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టులదేనని సీపీఐ జాతీయ సమితి నాయకులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. సాయుధ తెలంగాణ పోరాట వారోత్సవాల సందర్భంగా ఆదివారం వారిద్దరు మధిర పట్టణం, బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి, రాపల్లి, వైరా మండలం పాలడుగు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. నాటి నిజాం నవాబు నిరంకుశ పాలనలో జాగిర్దార్లు, జమిందార్లు, దేశముఖ్‌ల దగ్గర వెట్టిచాకిరీ చేస్తున్న మట్టిమనుషులను పట్టించి 3 వేల గ్రామాలను విముక్తి చేసి, 10 లక్షల ఎకరాలను పేద ప్రజలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందని తెలిపారు. సాయుధ పోరాటంలో వరంగల్ జిల్లాలోని ఈ ప్రాంతానికి ప్రత్యేకత ఉందని, నల్లమల గిరిప్రసాద్, వాసిరెడ్డి వెంకటపతి, ఊట్ల సాంబయ్య, ఎలమద్ది వెంకయ్యలాంటి అనేకమంది రజాకార్లను తరిమికొట్టారని తెలిపారు. చరిత్రను వక్రీకరిస్తూ నేటి పాలకులు రకరకాల పేర్లతో నాటి అమరవీరుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఎర్రా బాబు, జమ్ముల జితేందర్‌రెడ్డి, పోటు కళావతి, ఏపూరి లత, శింగు నర్సింహారావు, శివరామకృష్ణ, రామాంజనేయులు, కొండల్‌రావు, ఆనందరావు, ప్రకాష్‌రావు, మడుపల్లి లక్ష్మణ్, రామకృష్ణ, సీతామహాలక్ష్మీ, తోట రామాంజనేయులు, యంగల ఆనందరావు, తూము రోషన్‌కుమార్, ఏనుగు గాంధీ, యమాల గోపాలరావు, తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎల్‌సీడీ స్క్రీన్ ధ్వంసం


ఎల్‌సీడీ స్క్రీన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కొత్త మామిళ్లవారిగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న ఎల్‌సీడీ స్క్రీన్ శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు రాళ్లతో కొట్టి ధ్వంసం చేశారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎం పానగంటి ప్రసాద్‌రావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ పాఠశాలను సందర్శించి ఆకతాయిలు ధ్వంసం చేసిన ఎల్‌సీడీ పరికరాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం క్లూస్ టీంను రప్పించి తరగతి గదిలో వేలు ముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. అలాగే, మండలంలోని నారంవారిగూడెం కాలనీలో ఈ నెల 10వ తేదీ తెల్లవారుజామున తుమ్మలపల్లి సూర్యనారాయణ దంపతులపై గుర్తు తెలియని దుండగులు దాడికి పాల్పడి, భార్య కళావతి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును అపహరించిన ఘటనపై బాధితుల ఇంటి వద్దకు డీఎస్పీ వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. సీఐ కరుణాకర్, ఎస్‌ఐ శివరామకృష్ణ ఉన్నారు.

ఖమ్మం మార్కెట్ కార్యదర్శి మృతి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సహాయ కార్యదర్శి, టీఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ వజీరుద్దీన్ (43) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. శనివారం అనారోగ్యానికి గురైన వజీరుద్దీన్‌ను ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఆదివారం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. ఆయనకు తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఉమ్మడి వ్యవసాయ మార్కెట్ కమిటీల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తాడేపల్లి కిరణ్‌కుమార్, కార్యదర్శి నరేశ్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సహాయ కార్య దర్శి వీరాంజనేయులతోపాటు దేశబోయిన తిరుపతయ్య, జిల్లా వెంకటేశ్వర్లు, బాబు, చిన్న హుస్సేన్ వజీరుద్దీన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి..

ఖమ్మంక్రైం: అనుమానాస్పద స్థితిలో భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇందిరానగర్ వద్ద ఓ వ్యక్తి భవనం పైనుంచి పడి మృతి చెందినట్లు స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి వెళ్లగా అక్కడ ఓ వ్యక్తి తల పగిలి మృతి చెంది ఉన్నాడు. అయితే ఆ వ్యక్తిని కొందరు తరుముకుంటూ రావడం గమనించామని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు విచారించగా మృతిచెందిన వ్యక్తి మలినేని కల్యాణ్‌చక్రవర్తి (30) అని తేలింది. ఆయన గతంలో ఖమ్మంలోని బైపాస్‌రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉండేవాడని, ప్రైవేట్ కన్సల్టెంట్‌గా ప్రస్తుతం హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. అయితే, ఆయన ఖమ్మం ఎందుకు వచ్చాడు? ఆయన్ను తరుముకుంటూ వచ్చిన వ్యక్తులు ఎవరనేది విచారిస్తున్నామని పోలీసులు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

బోనకల్: మండల కేంద్రంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యార్లగడ్డ సాంబయ్య (36) పత్తి చేనుకు మందు కొట్టేందుకు ఈ నెల 13న కూలికి వెళ్లాడు. మందు కొట్టిన తరువాత పొలంలో చెట్టు కింద సేద తీరాడు. సాయంత్రం అయినప్పటికీ అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. కనిపించకపోవడంతో ఈ నెల 15న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అతను మందు కొట్టిన చేను వద్దకు వెళ్లి చూడగా పక్కనే ఉన్న వాగులో పడి ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.

చిన్నారిపై కుక్కల దాడి

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెంలో ఏడేళ్ల తిగుళ్ల నిహారిక ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కల గుంపు వచ్చి దాడి చేశాయి. అటుగా వస్తున్న అదే గ్రామానికి చెందిన చెరుకుపల్లి నాగయ్య చిన్నారిని కాపాడేందుకు వెళ్లగా ఆయనపై కూడా దాడి చేశారు. స్థానికులు గమనించి కుక్కల గుంపును తరిమేయడంతో ప్రమాదం తప్పింది. ఇద్దరినీ స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించి, ఖమ్మం తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ సెక్యూరిటీ గార్డ్స్ జీతం 15,000/- కోదాడ దగ్గర మేళ్ళచెరువులో కావలెను. 8 గం॥ డ్యూటీ, మంచి జీతం, తక్కువ రేటుకే భోజనం. ✆ 63008 79854, 86884 17132 [B-230]

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957
9705444182

గవర్నర్ మిలాద్-ఉన్- నబీ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: మిలాద్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధనలైన కరుణ, సహనం, సమైక్యత, సామరస్యం, విశ్వ మానవ సోదర భావం.. నిత్యం మనందరిలో స్ఫూర్తిని నింపుతూ ఉంటాయని, అందరి మేలు కోసం పని చేసేలా ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు.

ప్రవక్తబోధనలతో ధర్మబద్ధ జీవనం : సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: 'మిలాద్-ఉన్-నబీ' పర్వదినాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముస్లింలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్ నబీ ముస్లింలకు అత్యంత పవిత్రమైన రోజని పేర్కొన్నారు. శాంతి, సోదర భావం, కరుణ, ధర్మబద్ధ జీవనాన్ని చాటి చెప్పే ప్రవక్త బోధనలు యావత్ ప్రపంచానికి దిక్సూచి లాంటివని సీఎం తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కూడా మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు.

సాగర్ ఎడమకాల్వ వారంలోగా పునరుద్ధరణ

▶ మొదటి పేజీ తరువాయి

ముక్త్యాల బ్రాంచి కాల్వకు పడిన భారీ గండ్లు, వాటి మరమ్మతులకు జరుగుతున్న పనులను పరిశీలించారు. మరమ్మతులను పూర్తి చేసి వారంలోగా ఎడమ కాల్వకు నీటి సరఫరాను పునరుద్ధరించాలని నీటిపారుదల శాఖ ఇంజనీర్లకు సూచించారు. రెడ్లకుంట మేజర్ కాల్వకు 5 రోజుల్లో, ముక్త్యాల బ్రాంచి కాల్వకు 3 రోజుల్లోగా మరమ్మతులు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. కాగితం రామచంద్రాపురం దిగువన కుడికాల్వ కింద 2లక్షల ఎకరాలు, రెడ్లకుంట మేజర్ కాల్వ కింద 20వేల ఎకరాలు, ముక్త్యాల బ్రాంచి కాల్వ కింద 1.01 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు అవుతోందని, నీళ్ల కోసం రైతుల నుంచి ఒత్తిడి పెరిగిందన్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రింబవళ్లు పనులు నిర్వహించాలని ఆదేశించారు.

పునరుద్ధరణలో ఇంత వేగం ఎన్నడూ చూడలేదు..

ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 2 వరకు రాష్ట్రంలో ఎన్నడూ లేని రీతిలో భారీ వర్షాలు కురిసి వరదలు పోటెత్తగా, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టిందని మంత్రి ఉత్తమ్ అన్నారు. వరదలు తగ్గుముఖం పట్టిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల ప్రాజెక్టులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి పునరుద్ధరణ పనులకు అంచనాలు తయారు చేశామని, అత్యవసరంగా షార్ట్ టెండర్లు నిర్వహించి పనులను ప్రారంభించామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో జరుగుతున్న వరద సహాయక చర్యల వేగాన్ని తన రాజకీయ జీవితంలో మరెన్నడూ చూడలేదన్నారు. సాగర్ కుడికాల్వకు పడిన గండిని పూడ్చడానికి సాధారణంగా నెల రోజుల సమయం పడుతుందని, వచ్చే ఆదివారంలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

నష్టపోయాం.. మమ్మల్ని ఆదుకోండి..

కాగితం రామచంద్రాపురం, ఆర్ల గూడెం, కరక్కాయలగూడెం పర్య టన సందర్భంగా పెద్ద సంఖ్యలో రైతులు మంత్రి ఉత్తమ్‌ను కలిసి తమను ఆదుకోవాలని మొరబెట్టుకున్నారు. వరదల్లో పంటలు దెబ్బ తినడమే కాకుండా పొలాల్లో నాలు గైదు అడుగుల మేర ఇసుక మేటలు వేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ వరదల్లో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.16,500 చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. ఇళ్లు నష్టపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కొత్త ఇళ్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు మంజూరు చేస్తామన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం చెల్లిస్తామని చెప్పారు.



చిలుకూరు మండలంలో ఆర్లెగూడెం వద్ద పడిన గండి వద్దకు ట్రాక్టర్‌పై వెళ్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఫార్మాసిటీ ఉంటుందా? లేదా?

ప్రాజెక్టు వద్దనుకుంటే రైతుల భూములు తిరిగి ఇచ్చేయాలి

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: ఫార్మాసిటీ ప్రాజెక్టును ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా? అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. హైకోర్టు సైతం ఈ విషయంలో స్పష్టత కోరిందని, తక్షణమే ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్‌ను అంతర్జాతీయంగా నంబర్ వన్‌గా నిలిపే ఉద్దేశంతో ఫార్మా సిటీ అనే బృహత్తరమైన ప్రాజెక్టును గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిందని గుర్తు చేశారు. 9.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సాధించే లక్ష్యంతో ఫార్మా సిటీ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయాలని భావించామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 5 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందనే ఆలోచన చేశామన్నారు. భూ సేకరణను సైతం పూర్తి చేశామని తెలిపారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫార్మాసిటీ ప్రాజెక్టుపై గందరగోళం నెలకొందన్నారు. ఈ ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్లుగా సీఎం ప్రకటించటంతో ఫార్మా సిటీలో పెట్టుబడులు పెట్టే సంస్థలు ఆందోళన చెందుతున్నాయన్నారు. ఫార్మా సిటీ వస్తే ఉద్యోగాలొస్తాయని భావించిన యువత, బతుకులు బాగుపడతాయని భూములు ఇచ్చిన రైతుల్లో గందరగోళం నెలకొందన్నారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూమిని ఇతర ప్రాజెక్టుల కోసం వినియోగిస్తామంటే కుదరదని హైకోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. మొండి పట్టుదలకు పోయి రాజకీయాల కోసం తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ తీయవద్దని కోరారు. ప్రాజెక్టును రద్దు చేయాలని భావిస్తే రైతుల భూములను తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. భూములను ఇతర అవసరాలకు వాడతామంటే రైతులతో పాటు బీఆర్‌ఎస్ కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్రజలు అన్నీ గమనిస్తున్నారు: 'అసలు పార్టీలో చేర్చుకోవడం ఎందుకు? ఆ తర్వాత పదవులు పోతాయన్న భయంతో ఈ నాటకాలెందుకు?' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు, మంత్రి శ్రీధర్‌బాబును ప్రశ్నించారు. మంత్రి వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఎక్స్ వేదికగా ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. 'సిగ్గులేకుండా ఇంత నీతిమాలిన రాజకీయం ఎందుకు? మీరు ప్రలోభపెట్టి చేర్చుకున్న వాళ్లను మా వాళ్లు అని చెప్పుకోలేని మీ బాధను చూస్తే జాలి కలుగుతోంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు' అని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు.

జగన్ పాలనలో తలసరి ఆదాయం

భారీగా పెరుగుదల

గత ఐదేళ్లలో రూ.88,448 పెరిగిన రాష్ట్ర తలసరి ఆదాయం

గతంలో చంద్రబాబు ఐదేళ్ల పాలనలో పెరుగుదల రూ.60,128 మాత్రమే

2023-24లో రూ.2.42 లక్షలకు చేరిన రాష్ట్ర తలసరి ఆదాయం

జగన్ పాలనలో జాతీయ సగటును మించి పెరుగుదల

2023-24 దేశ ఆర్థిక వ్యవస్థ గణాంకాల నివేదికలో ఆర్‌బీఐ వెల్లడి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఊడ్చేసింది

చెరువుల్లా పొలాలు..
కనుచూపు మేర ఇసుక మేటలే..
నోటికాడ ముద్ద నేలపాలు..
ఆవిరైన అన్నదాత ఆశలు

కృష్ణా లంకల్లోనే కాదు.. 'ఏలేరు' పరీవాహకంలోనూ అదే దుస్థితి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ మానుకోండి

ఏపీ సీఎం చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ హెచ్చరిక



సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ఎంబీబీఎస్ సీట్లు వస్తుంటే సంతోషించాల్సింది పోయి.. అవసరం లేదంటూ చంద్రబాబు ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం చాలా దారుణమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేసే బృహత్తర యజ్ఞానికి రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా తన చేతులతో తానే భంగం కలిగించడం అత్యంత హేయం, దుర్మార్గమని మండి పడ్డారు. పక్క రాష్ట్రాలు కొత్త మెడికల్ కాలేజీలు, ఎంబీబీఎస్ సీట్ల కోసం ప్రదక్షిణలు చేస్తున్న పరిస్థితుల్లో మన రాష్ట్రానికి వచ్చిన సీట్లను తిప్పి పంపడం ఏ తరహా పరిపాలనకు నిదర్శనం అని చంద్రబాబును నిలదీశారు. 'ఇకనైనా కళ్లు తెరవండి.. వెంటనే ఎన్‌ఎంసీకి రాసిన లేఖను వెనక్కు తీసుకోండి. ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోండి' అని హితవు పలికారు. మెడికల్ కాలేజీల్లో మిగిలిన పనులను పూర్తి చేసి, పేద పిల్లలకు వైద్య విద్యను, పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 'మీకు చేతనైనంత మీరు ఖర్చు చేస్తూ వెళ్లండి.. మీకు చేతకాకపోతే మళ్లీ మేం వచ్చిన తర్వాత అయినా పూర్తి చేస్తాం. అంతేకానీ ఇలా మెడికల్ కాలేజీల ప్రైవేటుపరం మాటున స్కామ్‌లు చేయడం మానుకోండి. లేదంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని గుర్తించుకోండి' అని చంద్రబాబును హెచ్చరించారు. మెడికల్ కాలేజీల వ్యవహారంలో చంద్రబాబు ప్రభుత్వ తీరును తూర్పారపడుతూ ఆదివారం 'ఎక్స్' వేదికగా వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.

హైడ్రాకు కులమతాలు, రాజకీయాలు లేవు



ఇంజనీర్స్ డే వేడుకల్లో పాల్గొన్న మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ తదితరులు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/ఖైరతాబాద్: రాష్ట్ర ప్రభు త్వం ఏర్పాటు చేసిన హైడ్రాకు కులమతాలు, రాజకీయాలు లేవని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. వందేళ్ల క్రితం హైదరాబాద్‌ను వరదలు ముంచెత్తాయని, అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా పక్కా మాస్టర్ ప్లాన్ దిశగా హైడ్రా చర్యలు చేపట్టిందన్నారు. ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్యభవన్‌లో నిర్వహించిన ఇంజనీర్స్ డే కార్యక్రమాని కి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ '1908లో భారీ వరదలు వచ్చి హైదరాబాద్ నిండా మునిగింది. ఆ సమయంలో నిజాం నవాబు విశ్వేశ్వరయ్య గురించి తెలుసుకొని హైదరాబాద్‌కు ఆహ్వానించి హైదరాబాద్‌లో ఫ్లడ్ ప్రొటెక్షన్ అండ్ డ్రైనేజీ సిస్టమ్ ఏర్పాటు గురించి చెప్పగా, హైదరాబాద్ భౌగోళిక స్థితిగతులపై పూర్తిగా అధ్యయనం చేసిన విశ్వేశ్వర య్య నగరం పైభాగంలో ఉన్న 788 చెరువుల కుగాను వరదల కారణంగా 221 చెరువులు పూర్తిగా ధ్వంసమయ్యాయని గుర్తించారు. వర దలను తట్టుకోవాలంటే నగరానికి పై భాగంలో ఓ పెద్ద రిజర్వాయర్ కట్టాలని ప్రపోజ్ చేశారు. అందులో భాగంగానే మూసీకి ఉపనది అయిన ఇప్పుడున్న హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ నిర్మాణం చేశారు' అని తెలిపారు. అనంతరం ప లువురు ఇంజనీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐఈఐ చైర్మన్ ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్య, మాజీ చైర్మన్ రమణానాయక్, సంయుక్త కార్యదర్శి ప్రొఫెసర్ మోయినుద్దీన్ పాల్గొన్నారు.

మేలుకొలుపు యాత్రను విజయవంతం చేయండి



మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ పిలుపు

సాక్షి, హైదరాబాద్: ఈనెల 19 నుంచి ప్రారంభమయ్యే మాదిగల మేలు కొలుపు యాత్రను విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మాదిగ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో ఆదివారం మేలు కొలుపు యాత్ర కరపత్రాన్ని చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి విడుదల చేశారు. రాష్ట్రంలో జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, జనాభా ప్రాతిపది కన రిజర్వేషన్ కల్పించాలని చంద్రశేఖర్ ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణపై కమిటీ వేయడం హర్షణీయమన్నారు. పిడమర్తి రవి మాట్లాడుతూ, మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణతో తెలంగాణలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు భుదాల బాబూరావు, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఓక్కల గడ్డ చంద్రశేఖర్, తెలంగాణ దళిత దండు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రమళ్ళ మొగులయ్య, జేఏసీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు నక్క మహేశ్, మాదిగ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జెరిపోతుల సాయి మాదిగ పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

రామయ్య నిత్యాన్న దానానికి విరాళం



దాతకు రశీదు అందిస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం సన్నిధిలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి ఖమ్మానికి చెందిన భక్తులు ఆదివారం విరాళం అందజేశారు. నగరంలోని మామిళ్లగూడెం ప్రాంత వాసి దండి కోటయ్య, విమలమ్మ రూ.1,16,116 ఆలయ ఈఓ రమాదేవికి అందజేయగా ఆమె వారికి రశీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో 'సండే' సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ :పాల్వంచ మండలంలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ వద్ద నుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 451మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.15,550 ఆదాయం లభించగా, 230 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.10,260 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

భద్రాచలంలో వినాయక నిమజ్జనాలు షురూ..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద నాలుగు రోజులుగా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. ఇందుకోసం అధికారులు నాలుగు భారీ క్రేన్లు, రెండు జేసీబీలు, 60మంది గజ ఈతగాళ్లను ఏర్పాటుచేశారు. నిమజ్జన ఘాట్ వద్ద శాఖల వారీగా సంబంధిత అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఆదివారం సాయంత్రం వరకు రాష్ట్రంలోని వివిధప్రాంతాల నుంచి భద్రాచలం వచ్చిన భక్తులు 191 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. సోమవారం అధికసంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

హామీ 'నీటి'మూటే !



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పెసలు

- పెసల కొనుగోలులో అమలు కాని ప్రభుత్వ ప్రకటన
- నాణ్యత పేరిట పంట కొనుగోలుకు తిరస్కరణ
- వర్షాలతో దెబ్బతిన్న పంటకు దక్కని కనీస మద్దతు ధర
- వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్ముకుంటున్న దైన్యం



పెసలను ఆరబెడుతున్న రైతు

ఖమ్మంవ్యవసాయం: పెసల కొనుగోలులో ప్రభుత్వ హామీ నీటిమూటే అయ్యింది. భారీ వర్షాలు, వరదలు సంభవించడంతో బాధ్యులైన ప్రభుత్వ పెద్దలు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని, దెబ్బతిన్న ప్రతీ గింజ కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలు అప్పటికప్పుడు రైతులను ఉపశమనపర్చాయే తప్ప ఆచరణలో అమలు జరగడం లేదు. ఇప్పుడు పెసల కొనుగోలులోనూ ఇదే జరుగుతోంది. అపరాల పంటలకు జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. దీంతో ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరల్లో పెసరకు క్వింటా రూ. 8,682గా నిర్ణయించారు. అయితే పంటకు డిమాండ్ ఉన్నా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రూ.6 వేలకు మించి ధర పెట్టడం లేదు. పెసలకు కనీస మద్దతు ధర లభించటం లేదని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో మార్క్‌ఫెడ్ ద్వారా పంట కొనుగోళ్లు చేయిస్తోంది. కాగా, మార్క్‌ఫెడ్ నిబంధనల ప్రామాణికంగా పంట కొనుగోళ్లు జరుపుతుంది. ఈ క్రమంలో భారీ వర్షాలు కురవడంతో చేతికందే దశలో ఉన్న పెసర పంట దెబ్బతిన్నది. ప్రభుత్వ పెద్దల హామీ మేరకు కొనుగోలు కేంద్రాల్లో పెసలు తీసుకుంటారనే ఆశతో రైతులు తీసుకువస్తే, నాణ్యత లేదంటూ తిరస్కరిస్తున్నారు. దీంతో రైతులు ఆయా కేంద్రాల్లోనే వ్యాపారులు నిర్ణయించిన ధరకు అమ్ముకోక తప్పడం లేదు.

12 శాతం తేమ ఉంటేనే..

పెసల కొనుగోలుకు 12 శాతానికి మించి తేమ ఉండొద్దనే నిబంధన విధించారు. మార్క్‌ఫెడ్ అధికారులు యంత్రాల ద్వారా పరీక్షించి తేమ ఎక్కువగా ఉందని, నాణ్యత లేదని చెబుతూ కొనుగోలుకు తిరస్కరిస్తున్నారు. తేమలో ఒక్క శాతం తేడా ఉన్నా తీసుకోవడం లేదు. ప్రస్తుతం తేమ వాతావరణం నెలకొని ఉండడంతో రైతులు పంటను ఆరబెట్టి తీసుకొస్తున్నా.. తేమ పేరిట తిరస్కరిస్తున్నారు. ఖమ్మం, వైరా వ్యవసాయ మార్కెట్లలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు నిత్యం రైతులు పెసలను విక్రయానికి తీసుకొస్తున్నా అరకొరగా కొనుగోళ్లు జరిపి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి తక్కువ ధరకైనా అమ్మక తప్పడం లేదు.

దెబ్బతిన్న పంట వైపు చూడడమే లేదు..

దెబ్బతిన్న పంటలను కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వ శాఖలు అంచుల్లోకి కూడా రానివ్వడం లేదు. నాణ్యమైన పెసలనే పరీక్షలు జరిపి అందులో కొందరివి మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. తేమ శాతం పేరిట చాలా మంది రైతుల పంటను తిరస్కరిస్తున్నారు. ఈ విషయంలో రైతులు అధికారులను కలిసి మొర పెట్టుకున్నా ఏ మాత్రం ప్రయోజనం ఉండడం లేదు.

వ్యాపారులు నిర్ణయించిన ధరకే..

ప్రభుత్వం తిరస్కరించిన పెసలను వ్యాపారులకు విక్రయించక తప్పటం లేదు. ఇదే అదునుగా వ్యాపారులు మరింతగా ధర తగ్గించి కొనుగోళ్లు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 8,682 కాగా వ్యాపారులు రూ.6 వేలు, అంతకంటే తక్కువకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు మద్దతు ధరతో పోలిస్తే క్వింటాకు సుమారు రూ.3 వేల వరకు నష్టపోతున్నారు.

తేమసాకుతో తిరస్కరించారు



ఆరెకరాల్లో పెసర సాగు చేశా. 9 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 6 క్వింటాళ్లు పూర్తి నాణ్యంగా ఉంది. 3 క్వింటాళ్లు కొంత నాణ్యత తక్కువగా ఉన్నాయి. నాణ్యంగా ఉన్న పంటను తేమ శాతం 14 ఉందని తిరస్కరించారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు రూ. 6,900 చొప్పున విక్రయించక తప్పలేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కూడా దళారుల ప్రమేయం ఉంది.

– బండి నాగేశ్వరరావు, తుమ్మలపల్లి, కొణిజర్ల మండలం

పెసల కొనుగోళ్లలో అన్యాయం



పెసల కొనుగోళ్లలో రైతులకు అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వం వర్షాలకు దెబ్బతిన్న పంటను కూడా కొనుగోలు చేస్తుందని ఓ వైపు చెబుతుండగా, కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల పేరిట తిరస్కరిస్తున్నారు. ఇదెక్కడి అన్యాయం. అసలే అంతంత మాత్రంగా పంట పండింది. ఇటీవల కురిసిన వర్షాలకు కొందరి చేలు వరదపాలయ్యాయి. పండిన పంటకు కూడా కనీస మద్దతు ధర దక్కకపోవడం దారుణం. నేను రెండున్నర ఎకరాల్లో పెసర వేశా. 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో నిబంధనలు ఇబ్బందికరంగా ఉన్నాయి.

– ఒర్సు లక్ష్మయ్య, రామకృష్ణాపురం, చింతకాని మండలం

దళారుల 'పంట' పండుతోంది..

రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన పెసలను బినామీల పేరిట ప్రభుత్వ కొనగోలు కేంద్రంలో విక్రయించేందుకు వ్యాపారులు తెర చాటు వ్యవహారాలను నిర్వహిస్తున్నారు. గతంలో అమలు చేసిన ఎత్తుగడలను తిరిగి వినియోగించి పంట విక్రయించేందుకు పన్నాగాలు పన్నుతున్నారు. ఇప్పటికే కొందరు వ్యాపారులు తమకు అనుకూలంగా ఉండే రైతుల నుంచి ధ్రువపత్రాలను సిద్ధం చేసుకుని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఈ దందాకు కొందరు మధ్య దళారులుగా వ్యవహరిస్తున్నారు. రైతుల నుంచి రూ. 5 నుంచి 6 వేల చొప్పున కొనుగోలు చేసిన పెసలను కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం ప్రకటించిన రూ. 8,682 మద్దతు ధరకు విక్రయిస్తున్నారు.

'జూనియర్ ఇన్‌స్పెక్టర్' నియామకమెప్పుడో?

- పరీక్షలు నిర్వహించి రెండు నెలలు
- అయినా భర్తీ చేయని ఐదు పోస్టులు



జూనియర్ ఇన్‌స్పెక్టర్ పరీక్షను పర్యవేక్షిస్తున్న సెక్యూరిటీ జీఎం దీక్షితులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న ఐదు జూనియర్ ఇన్‌స్పెక్టర్ (ఇంటర్నల్) టీ అండ్ ఎస్ గ్రేడ్ -డీ పోస్టుల భర్తీకి యాజమాన్యం ఈ ఏడాది జనవరిలో నోటిఫికేషన్ విడుదల చేసింది. సుమారు ఏడు నెలల తర్వాత జూలై 7వ తేదీన పరీక్షలు నిర్వహించింది. పోస్టులకు 27 మంది దరఖాస్తు చేసుకోగా, పరీక్షకు 26 మంది హాజరయ్యారు. ఈ ఫలితాలు పరీక్ష జరిగిన గంటలోపే లేదంటే అదేరోజు సాయంత్రం వరకు వెల్లడించే అవకాశం ఉంది. కానీ రెండు రోజుల తర్వాత ప్రకటించారు. ఇందులోనే జాప్యం అనుకుంటే పరీక్ష జరిగి రెండు నెలలు దాటినా ఎంపిక చేసిన వారి పేర్లను రిక్రూట్‌మెంట్ సెల్ ఇంతవరకూ ప్రకటించకపోవడం ఏంటని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఫలితాల వెల్లడిలో జాప్యం చేయడం వెనుక ఏదో కారణం ఉంటుందనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఫలితాల విషయంలో ఎవరైనా అభ్యర్థులు కోర్టుకు వెళ్లారా అంటే అదీ లేదు. కాగా, ఈ విషయమై కొంతమంది అభ్యర్థులు సింగరేణి సీఎండీని కలవగా త్వరలో ఫలితాలు విడుదల చేస్తామని చెప్పారని, అది కూడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ అధికారులు స్పందించి వీలైనంత త్వరగా జాబితా ప్రకటించి, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ఎలక్ట్రీషియన్ ట్రైనీ రాతపరీక్షకు 150 మంది



పరీక్షను పర్యవేక్షిస్తున్న జీఎం సుధాకర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న ఎలక్ట్రీషియన్ ట్రైనీ కేటగిరి -1 (ఇంటర్నల్) రాత పరీక్ష ఆదివారం నిర్వహించగా 150 మంది హాజరయ్యారని సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం సామ్యేల్ సుధాకర్ తెలిపారు. సింగరేణి మహిళా కళాశాల కేంద్రంలో ఆయన పరీక్షను పర్యవేక్షించి మాట్లాడారు. జనవరిలో విడుదల చేసిన ఈ నోటిఫికేషన్‌కు సింగరేణి వ్యాప్తంగా వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న అంతర్గత అభ్యర్థులు 178 మందికి హాల్‌టికెట్లు పంపిణీ చేశామని, వారిలో 28 మంది గైర్హాజరు కాగా, 150 మంది పరీక్ష రాశారని వివరించారు. సెక్యూరిటీ, విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణలో సీసీ కెమెరాల నిఘా మధ్య పరీక్ష నిర్వహించామన్నారు. ఫలితాలను ఆదివారం రాత్రే సింగరేణి ప్రధాన కార్యాలయ నోటీస్ బోర్డులో, సింగరేణి వెబ్‌సైట్‌లో పొందుపర్చామని, అభ్యర్థులు చూసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జీఎం విజిలెన్స్(ఈఅండ్‌ఎం) ప్రసాద్‌రావు, డీజీఎం వేణుగోపాలరావు, విజిలెన్స్ అధికారి డి. వీరయ్య, పర్సనల్ మేనేజర్ ప్రకాశ్‌రావు. బి.సమ్మయ్య, డీవైపీఎంలు డి.నాగేశ్వర రావు, కె.సంతోష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా శారద తదితరులు పాల్గొన్నారు.

రూ.29 లక్షలకు గణేష్ లడ్డూ కైవసం



కైవసం చేసుకున్న లడ్డూతో గణేష్-సరిత దంపతులు

ఇల్లెందు : హైదరాబాద్‌లోని 'మై హోం బుజా'లో గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను ఇల్లెందు 20వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి సరిత - ఆమె భర్త గణేష్ రూ.29 లక్షలకు వేలం ద్వారా కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. దేవుడి కృప లేకుండా ఏ రంగంలోనూ విజయం సాధ్యం కాదని తాను నమ్ముతానని చెప్పారు. తన తల్లిదండ్రులు, ఇల్లెందుకు చెందిన మాజీ కౌన్సిలర్‌లు కొండపల్లి కోటేశ్వరరావు-మణి ఇల్లెందు స్టేషన్ బస్తీలో గణేష్ ఆలయం నిర్మించారని, అందుకే తనకు గణేష్ అని నామకరణం చేశారని గుర్తు చేసుకున్నారు. కాగా, లడ్డూను కైవసం చేసుకున్న గణేష్ - సరిత దంపతులను గేటెడ్ కమ్యూనిటీలో ఘనంగా సత్కరించారు.